# వక్ఫ్ ల్యాండ్స్ కబ్జా



## గీతాంజలి స్కూల్ ఎదురుగా ఆక్రమణ
## కోట్ల విలువ చేసే ల్యాండ్స్ మాయం

**కుత్బుల్లాపూర్ : మార్చ్ 1 (పీపుల్స్ న్యూస్)**





నగరంలో కాళీ జాగా కనిపిస్తే చాలు రెచ్చిపోతున్న కబ్జా రాయుళ్లు రాత్రికి రాత్రే నకిలీ పత్రాలను సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్న ఘటనలు కనిపిస్తున్నాయి. తాజాగా బౌరంపేటలోని సర్వేనెంబర్ 663, 664, 665, 715 సర్వే నెంబర్లలో 1989 నుండి వక్ఫ్ బోర్డు ల్యాండ్ గా ప్రభుత్వ అధికారులు ఉంది. కొందరు కబ్జారాయుళ్లు దీనిపై కన్ను వేసి ఎట్టకేలకు వక్ఫ్ స్థలాన్ని కొట్టేసేందుకు ప్రయత్నించారు. సుమారు 2.19 గుంటల స్థలం కబ్జా రాయుళ్ల చేరలో బందీగా మారింది. వక్ఫ్ భూముల పరిరక్షణలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడావెల్లువెత్తుతున్నాయి. విలువైన భూములు మాయం అవుతుంటే రెవెన్యూ, వక్ఫ్ శాఖలు ఎందుకు మౌనం వహిస్తున్నాయన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణలో హైడ్రా నిర్లక్ష్యం..?**

ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి స్థానికంగా ఉన్న కుంటలు, చెరువులు మరియు కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నప్పటికీ, హైడ్రా ఇప్పటివరకు ఈ ప్రాంతం దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ భూములు, నీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు అక్రమార్కులు కుంటల పరిధిని తగ్గిస్తూ, ప్రభుత్వ స్థలాలపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.




**హైడ్రా తలుచుకుంటే ఆధీనంలోకి.. ప్రభుత్వ స్థలాలు.**

ప్రత్యేకంగా కుంటలు, చెరువులు నీటిని నిల్వ చేసేందుకు కీలకంగా ఉంటాయని, వాటి పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే సామాన్య ప్రజలకు నష్టం తప్పదని వారు పేర్కొంటున్నారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి, సంబంధిత ప్రాంతాల్లో సర్వే నిర్వహించి అక్రమాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజా ఆందోళనలు తీవ్రరూపం దాల్చే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

